క్లుప్తంగా

శేకూరు వీఆర్‌ఏ ఆత్మహత్య

శేకూరు(చేబ్రోలు): అనారోగ్యంతో వీఆర్‌ఏ మద్యంలో పురుగుమందు కలుపుకొని ఆత్మ హత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు గ్రామ సచివాలయంలో వీఆర్‌ఏగా మాతంగి నాగ సుబ్బయ్య(36) పనిచేస్తున్నాడు. ఫిట్స్ లక్షణా లతో పాటు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన నాగ సుబ్బయ్య ఈ నెల 24వ తేదీన మద్యంలో పురుగుమందు కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చేబ్రోలు ఎస్‌ఐ డి.వెంకట కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు చేబ్రోలులో క్రెడిట్ క్యాంపు

చేబ్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఎస్‌ఎంఈ కింద స్వయం ఉపాధిలో భాగంగా రుణ అర్హత మేళా(కెడిట్ క్యాంపు) శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.లలిత బుధవారం తెలిపారు. బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ లబ్ధిదారులకు కార్పొరేషన్ లోన్స్ నిమిత్తం అన్ని బ్యాంకు శాఖాధికారులు, సెలక్షన్ కమిటీ సభ్యులు హాజరవుతారని తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ కమిటీ వారి ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు.

అలరించిన భారతీయ శాస్త్రీయ సంగీత ప్రదర్శన



గుంటూరు రూరల్: భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలపై యువతకు అవగాహన అవసరమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో భారతదేశంలో ప్రఖ్యాతి గాంచిన వీణ వాయిద్య కళాకారిణి సరస్వతి రాజగోపాలన్, మృదంగం వాయిద్య కళాకారులు కల్లూరి శ్రీనివాస్, గాత్రం మృదంగ కళాకారులు సరస్వతుల హనుమంతరావు బృందం శాస్త్రీయ సంగీత ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కల్చరల్ కమిటీ ఇన్‌చార్జి కన్వీనర్ రంగరాయచౌదరి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో బైక్ చోరీ దొంగ

పెదకాకాని: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని గ్రామంలోని పాతూరు రోడ్డులో ఉన్న యాగంటి అపార్ట్‌మెంట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి బుధవారం తెల్లవారుజామున బైక్‌ను దొంగిలించి వెళుతుండగా స్థానికులకు అనుమానం వచ్చి నిలదీశారు. ఆగకుండా పారిపోతుండగా వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడు గడ్డిపాడుకు చెందిన మైదుకూరు సువర్ణరాజుగా గుర్తించారు. బైక్‌లు దొంగిలించేందుకే పెదకాకాని వచ్చినట్లు విచారణతో వెల్లడైందని పెదకాకాని సీఐ టీపీ నారాయణ స్వామి తెలిపారు.

విజ్ఞాన్ నిరులలో ఇండస్ట్రీ బెస్ట్ ప్రాక్టీస్‌పై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ అండ్ ఇండస్ట్రీ బెస్ట్ ప్రాక్టీసెస్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ రాధిక మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు నైపుణ్యాల మెరుగుకు దోహదం చేస్తాయని చెప్పారు. అమెరికాకు చెందిన ప్రఖ్యాత వాల్మార్ట్ సంస్థలో సీనియర్ మేనేజర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న వాసుదేవ మనేపల్లి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ వి.లక్ష్మణ్‌నారాయణ, అధ్యాపకులు అతిథులను సన్మానించారు.

ఏప్రిల్ 3న విజయవాడలో రైతు సదస్సు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 3న విజయవాడలో రాష్ట్ర స్థాయి రైతు సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర పధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ తెలిపారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో నిర్వహించనున్న సదస్సుకు అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రాజన్ క్షీరసాగర్, మాజీ వ్యవసాయశాఖ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, విశాఖ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ చలసాని రాఘ వేంద్రరావు హాజరవుతారని చెప్పారు. ఆవిష్కరణ కార్యక్రమంలో రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, కౌలు రైతుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంజుల విశల్ రెడ్డి, పి.వి.జగన్నాథం పాల్గొన్నారు.

ఏకపక్షంగా అంజుమన్, లాల్ తలాబ్ కమిటీలు

రంజాన్ వేళ టీడీపీలో రచ్చరచ్చ

- అంజుమన్, లాల్ తలాబ్ మసీదు కమిటీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే నసీర్
- అంజుమన్ కమిటీపై పశ్చిమ ఎమ్మెల్యే మాధవి ఆరా
- కనీస సమాచారం లేదంటూ ఆవేదన
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ముస్లిం సంఘాలు, టీడీపీ మైనారిటీ నాయకులు


PROCEEDINGS OF THE CHIEF EXECUTIVE OFFICER, A.P.STATE WAQF BOARD.

కమిటీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేరుతో మార్చి 12న విడుదలైన ఉత్తర్వుల కాపీ



లాలాపేటలోని అంజుమన్-ఎ-ఇస్లామియా సంస్థ

లక్ష్మీపురం: రంజాన్ వేళ ముస్లిం సంఘాలకు అధ్యక్షుల ఎంపిక టీడీపీలో రచ్చకు దారితీసింది. ఏకపక్షంగా ఎంపిక చేయడంపై వివిధ ముస్లిం సంఘాలతో పాటు ఆ పార్టీకి చెందిన మైనారిటీ నాయకులు రగిలిపోతున్నారు. వెస్ట్ ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వకపోవడంపై ఎమ్మెల్యే కినుక వహించినట్లు సమాచారం.

కమిటీ ఎన్నిక పోటాపోటీ..

ముస్లింలు అంజుమన్ ఏ ఇస్లామియా సంస్థ, లాల్ తలాబ్ కమిటీలను ప్రతిష్టాత్మకంగా భావిస్తుంటారు. వాటి నాయకత్వాన్ని కూడా ముస్లిం సమాజాన్ని నడిపించే వ్యక్తులు అలకరించేందుకు ప్రాధాన్యం ఇస్తుంటారు. వీటికి ఎన్నికలు నిర్వహించిన కమిటీలను ఏర్పాటు చేస్తుంటారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలకు భిన్నంగా ఎంపికలపై ముస్లిం సమాజం విస్మయం వ్యక్తం చేస్తోంది.

అంజుమన్ కమిటీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

నగరంలో చరిత్ర కలిగిన అంజుమన్-ఎ-ఇస్లామీయా సంస్థకు కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ హామీ ఇచ్చారు. అయితే వక్ఫ్‌బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహమ్మద్ అలితో మాట్లాడుకుని అంజుమన్-ఎ-ఇస్లామియా, కమిటీ అధ్యక్షుడుగా తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పేరుతో కమిటీని ఈనెల 7వ తేదీన ఆర్డర్ ఇవ్వగా ఈనెల 12న ఉత్తర్వులను మంజూరు చేశారు. అదే విధంగా లాల్ తలాబ్ కమిటీకి తన మద్దతుదారుడైన నిసార్‌ను అధ్యక్షుడిగా నియమితులయ్యే విధంగా కృషి చేశారు. దీనిపై ముస్లిం సంఘాలు గుర్రుగా ఉన్నాయి.

షేక్ గౌస్‌కు మొండిచేయి..

ఇదిలా ఉంటే ఎన్నికల ముందు నసీర్ అహ్మద్ అంజుమన్-ఎ-ఇస్లామియా సంస్థలో మాజీ శాసన సభ్యుడు నంబూరు సుభాని తనయుడు మాజీ డిప్యూటీ మేయర్ షేక్ గౌస్‌ను నియమిస్తామని, అలాగే ఈ కమిటీకి సంబంధించి ఎలాంటి ఎన్నికలు నిర్వహించకుండానే గత పాలకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారంటూ కూటమి అధికారంలోకి వస్తే కచ్చితంగా అంజుమన్ కమిటీ నియామకపై తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి ముస్లింలతో మాట్లాడి ఎన్నికలు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభానికి ఇచ్చిన హామీని పక్కన పెట్టడమే కాకుండా కమిటీ గురించి కనీస సమాచారం కూడా ఇవ్వక పోవడంపై మాజీ ఎమ్మెల్యే నంబూరు సుభాని వర్గీయులు, ఇటు పశ్చిమ నియోజక వర్గ టీడీపీ మైనారిటీ నాయకులు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవి వద్ద పంచాయితీ పెట్టారు.

అంజుమన్ కమిటీపై పశ్చిమ ఎమ్మెల్యే ఆరా...?

పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం ఓటర్లు సుమారు 35 వేలకు పైగానే ఉన్నారు. అయితే అంజుమన్ కమిటీని నియమించే సమయంలో పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవికి కాని మైనారిటీ నాయకులకు కనీస సమాచారం లేకుండా ఇష్టారాజ్యంగా కమిటీ ఏర్పాటుపై మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే నియోజకవర్గ ముస్లిం మైనారిటీ నాయకులతో సమావేశం నిర్వహించినట్లు చెబుతున్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మాధవి అంజుమన్ కమిటీ గురించి సమాచారం వచ్చిన సమయంలో అసెంబ్లీలో ఉండటం వల్ల తక్షణమే మైనారిటీ మంత్రి ఫారుఖ్‌కు తెలియజేశానని మైనారిటీ నాయకులను సముదాయించినట్లు సమాచారం. అయితే పశ్చిమ నియోజకవర్గ పరిధిలోను ముస్లింలకు కమిటీలో సముచిత స్థానం కల్పించాలని, అలాగే అంజుమన్ కమిటీ వ్యవహారాలకు సంబంధించి పశ్చిమ ఎమ్మెల్యేకు కూడా కమిటీ సమావేశంలో హాజరు అయ్యేలా చూడాల్సిందిగా ఎమ్మెల్యేకు టీటీపీ మైనారిటీ నాయకులు విన్నవించినట్లు నాయకులు చెబుతున్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ బాధితులకు నష్టపరిహారం

కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణంలో భాగంగా జీఎంసీ చేపట్టిన 120 అడుగుల రోడ్ విస్తరణలో ప్రభావితమయ్యే భవనాలకు నష్ట పరిహారం, స్థలాలకు టీడీఆర్ బాండ్లను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో శంకర్ విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణం వలన ప్రభావితమయ్యే భవనాల యజమానుల్లో కోర్టును ఆశ్రయించిన వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆర్‌ఓబీ నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్ విస్తరణ పనులు ప్రారంభించామని, ఇప్పటికే ప్రభావిత భవనాల్లో 36 మంది అంగీకార పత్రాలు అందించారని వివరించారు. కొందరు కోర్టును ఆశ్రయించారని, వారందరూ ఆర్‌ఓబీ నిర్మాణానికి వ్యతిరేకం కాదని, కేవలం నష్ట పరిహారం అంశంపై కోర్టుకి వెళ్లడం జరిగిందన్నారు. ఆర్‌ఓబీ నిర్మాణ టెండర్లు ఈ నెలాఖరు నాటికి ఫైనల్ అవ్వడం, ఏప్రిల్ 15 తర్వాత పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉందన్నారు. రోడ్ విస్తరణ జరిగే ప్రాంతాల్లో పట్టణాల్లో స్ట్రక్చరల్ నష్ట పరిహారం (భవన నిర్మాణ వయస్సుని అనుసరించి), స్థలాలకు టీడీఆర్ బాండ్లు అందించడం జరుగుతుందని వివరించారు. మరో విధానంలో భూ సేకరణ ద్వారా కూడా విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. భూ సేకరణ చట్టం 2013 ప్రకారం నగర పరిసరాల్లో మార్కెట్ విలువపై రెండు రెట్లు నష్ట పరిహారం ఇవ్వబడుతుందని, అదే చర్చల ద్వారా అంగీకార పత్రం ఇచ్చిన వారికి కోల్పోతున్న భూమికి 4 రెట్లు విలువైన టీడీఆర్ బాండ్లు ఇస్తామన్నారు. విస్తరణ పనులు పారదర్శకంగా చట్ట ప్రకారం, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జరుగుతాయని, ఇందులో ఏ అపోహలకు తావు లేదన్నారు. విస్తరణ ప్రభావిత భవన యజమానులు ఏ అనుమానం ఉన్నా లేదా సమస్య ఉన్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు, ఏసీపీలు రెహ్మాన్, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, ఈఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నగరంలో బ్లాక్ స్పాట్‌లు గుర్తింపు



అధికారులకు సూచనలిస్తున్న డీఎస్పీ రమేష్, పక్కన సీఐ సింగయ్య

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం నగరంలో ఆయన పలు ప్రాంతాలను తనిఖీ చేశారు. ముఖ్యంగా వెస్ట్ సబ్‌డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి బ్లాక్‌స్పాట్‌లను గుర్తించారు. ఇన్స్‌పెక్షన్ బంగ్లా ప్రాంతం, సుభాని హోటల్, నల్లపాడు రోడ్డు వీఐపీ రోడ్డు, చుట్టుగుంట సెంటర్, ఎత్తురోడ్డు సెంటర్, మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా(ఎంటీబీ) సెంటర్, మూడు బొమ్మల సెంటర్, ఎస్‌బీఐ జంక్షన్, కంకరగుంట బ్రిడ్జి, శ్యామలానగర్ పెట్రోల్ బంక్, పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికం కావటంతో వాటిని బ్లాక్ స్పాట్‌గా పరిగణంలోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. బ్లాక్ స్పాట్ ప్రాంతాలను పరిశీలించి స్పీడ్ బ్రేకర్లు, సీసీ కెమెరాలు, స్టాఫ్ బోర్డులు, రేడియం స్టిక్కర్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, ఎస్‌ఐలు శ్రీహరి, నరేంద్ర పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయిదారులకు ఊరట

- పన్ను బకాయిలకు 50 శాతం రాయితీ
- అసెస్‌మెంట్లు 1600, రావాల్సిన బకాయి రూ.కోటి
- వడ్డీ మినహాయింపుతో తగ్గనున్న భారం రూ.13.50 లక్షలు



బకాయిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రమేష్‌బాబు

పొన్నూరు: ఆస్తి పన్ను బకాయిదారులపై సగం వడ్డీ భారం తగ్గిస్తూ పురపాలక శాఖ నిర్ణయంతో పట్టణంలోని భవన యజమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజులుగా మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలంటూ ముమ్మరంగా ప్రచారం చేశారు. మున్సిపల్ రెవెన్యూ అధికారులు సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ తిరిగారు. ప్రస్తుత సంవత్సరం వడ్డీ మాఫీ లేనందున వెంటనే పాత బకాయిలన్నీ చెల్లించాలంటూ ప్రజలపై ఒత్తిడి తెచ్చారు. మరో అడుగు ముందుకు వేసి అత్యవసర సేవలు నిలిపి వేస్తామని చెప్పడమే కాకుండా కొళాయి కనెక్షన్లు కూడా తొలగించారు. నీటి అవసరాల రీత్యా ప్రజలు అప్పు తెచ్చి పన్ను బకాయిలు చెల్లించారు.

తగ్గిన వడ్డీ భారం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పొన్నూరు పురపాలక సంఘంలో 11,651 అసెస్మెంట్ల ద్వారా రావాల్సినది రూ. 5.74 కోట్లు డిమాండ్ ఉంది. ఇప్పటి వరకు రూ.4.73 కోట్లు వసూలు చేశారు. మిగిలిన 1600 అసెస్మెంట్ల నుంచి రూ. కోటి రావాల్సి ఉండగా వారి నుంచి పూర్తి వడ్డీ రూ.27 లక్షలు రావాల్సి ఉంది. దీని ద్వారా 50 శాతం వడ్డీ మినహాయిస్తే రూ.13.50 లక్షలు యజమానులపై భారం తగ్గనుంది.

ఈ నెల 31లోపు చెల్లిస్తేనే...

ముప్పాళ్ల రమేష్‌బాబు, కమిషనర్, పొన్నూరు

పన్ను బకాయి మొత్తం ఒకేసారి ఈనెల 31వ తేదీలోగా చెల్లించిన వారికి 50 శాతం రాయితీ వర్తిస్తుంది. ఇప్పటికే పన్ను బకాయిలు లేకుండా వడ్డీతో కట్టిన వారికి కూడా ఈ రాయితీ వర్తిస్తుంది. కట్టిన వారికి వడ్డీ రాయితీ రానున్న ఆర్థిక సంవత్సరంలో జమ చేయబడుతుంది. సగం కట్టిన వారికి ఈ మినహాయింపు ఉండదు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని బుధవారం ఎంఈఓ కెఎఫ్.కెనడీ తనిఖీ చేశారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం చేసే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొక్కిలిగడ్డ కల్పన ఉన్నారు.


రైలు పట్టాలపై పశువులు, గొర్రెలు వస్తే కఠిన చర్యలు

లక్ష్మీపురం: ఇటీవల పలు ప్రాంతాలలో పశువులు, గొర్రెలు మేపే వారు పట్టాలపై వదిలేయడం వలన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆర్పీఎఫ్ సీఐ ఆర్.వీరబాబు అన్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రెడ్డిపాలెం, నంబూరు, పెదకాకాని, కొప్పురావూరు, మంగళగిరి, నులకపేట వంటి పలు ప్రాంతాలలో ఆర్పీఎఫ్ సిఐ వీరాబాబు, ఎస్సై శ్రీనివాసరెడ్డి, రైల్వే ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలసి అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైలు పట్టాల వెంబడి పశువులను మేతకు తోలుకొని వెళ్లవద్దని, అవి ప్రమాదానికి గురి అయ్యే అవకాశం ఉందన్నారు. రైలు పట్టాలపై వచ్చే సమయంలో పశువులు, గొర్రెలు అడ్డుగా ఉంటే ప్రమాదాలు సంభవించి ప్రాణాపాయం జరిగే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. ప్రధానంగా పశువులు పట్టాలపై రాకుండా ఆయా ప్రాంతాలలో ఉండే పశువుల కాపరులకు తగిన సూచలను పలు మార్లు తెలియజేసిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇటువంటి చర్యలు పునరావృత్తం కాకుండా చూసుకోవాలని లేని పక్షంలో చట్ట పరమైన చర్యలు తీవ్రంగా ఉంటాయని పేర్కొన్నారు.

కారు బీభత్సం.. ఒకరికి గాయాలు

పట్నంబజారు: మద్యం మత్తులో యువకుడు కారుతో బీభత్సం సృష్టించిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. చిలకలూరిపేటకు చెందిన వంశీకృష్ణ బుధవారం సాయంత్రం మద్యం తాగి కారుతో విజయటాకీస్ నుంచి నాజ్‌సెంటర్ వైపు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులతోపాటు, పలు వాహనాలను ఢీకొట్టాడు. ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. మద్యం మత్తులో కారు డ్రైవింగ్ చేసిన వంశీకృష్ణను స్థానికులు నిలువరించి దేహశుద్ధి చేశారు. భగత్‌సింగ్ బొమ్మ సెంటర్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది కారు, వంశీకృష్ణను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రకృతి' విధానాలను సమర్థంగా అమలు చేయాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులు

గుంటూరు రూరల్: జాతీయ స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని సమర్థంగా అమలు చేసేందుకు అందరూ సమష్టిగా పనిచేయాలని రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.రామారావు కోరారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ కార్యక్రమాల అమలులో భాగంగా మేనేజ్ జాతీయ సంస్థ ఆర్థిక సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై ముడురోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం నగరంలోని రాయల్ పార్క్ హోటల్‌లో బుధవారం ప్రారంభించారు. రైతు సాధికార సంస్థ సలహాదారుడు డాక్టర్ డీవీ రాయుడు మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయం కారణంగా మొక్కలు, సూక్ష్మజీవుల మధ్య ఉండే సంబంధం బాగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ దబోల్కర్ పరిశోధనలను ప్రస్తావిస్తూ బహుళ పంటల సాగు విధానాలు ఒక ఎకరం విస్తీర్ణంలో ఐదు ఎకరాలకు సమానమైన ఉత్పాదకతగా మార్చగలవని వివరించారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, నీటి కొరత, పర్యావరణ సంక్షోభాలు ప్రధాన సమస్యలుగా పేర్కొన్నారు. అధిక రసాయనిక ఎరువుల వినియోగం కారణంగా భూసారం తగ్గిపోవడం, కార్బన్ ఉద్గారాలు పెరగడం, నీటి కాలుష్యం వంటి ప్రభావాలు కనిపిస్తున్నాయని, ఏలూరు ఘటనలో భారీ లోహాల కలుషిత నీరు ఇందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ ఉద్యమం రసాయనాలపై ఆధారపడకుండా, రైతులకు స్వావలంబన పెంచేందుకు దోహదం చేయడం లక్ష్యంగా పెట్టుకుని, ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరిస్తోందన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, మేనేజ్ సంస్థ టెలీ సలహాదారు ఐశ్వర్య, సీనియర్ థిమాటిక్ లీడ్‌లు చంద్రశేఖర్, గోపిచంద్, డాక్టర్ జాకీర్ హుసేన్, థిమాటిక్ లీడ్ సురేష్, సీనియర్ రిసోర్స్ పర్సన్ రామచంద్రం, రాజేశ్వర్ పాల్గొన్నారు.

పన్ను చెల్లింపునకు ఐదు రోజులే గడువు

నెహ్రూనగర్: ఆస్తి పన్ను చెల్లించటానికి ఈ నెలాఖరు వరకే(5 రోజులే) గడువు ఉందని, పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం దృష్ట్యా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు తెలిపారు. ఈ క్యాష్ కౌంటర్లు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బుధవారం మెయిన్ ఆఫీస్‌లోని ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పన్ను బకాయిలు ఈ నెలాఖరులోగా ఏక మొత్తంగా చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని వివరించారు. నగర ప్రజలు ఈ నెలాఖరులోపు తమ ఇంటి పన్ను, ఖాళీ స్థల పన్ను, నీటి పన్నులు పూర్తిగా చెల్లించాలని తెలిపారు. పన్ను చెల్లించడానికి వచ్చే వారికి ఏ సమస్య తలెత్తకుండా కార్యాలయ మేనేజర్ బాలాజీ బాష కౌంటర్ల వద్ద పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

క్రమబద్ధీకరణకు..

నెహ్రూ నగర్: నగర పాలక సంస్థ పరిధిలో అనధికార లేఔట్లు, ప్లాట్లు, అనుమతి లేకుండా, అనుమతి పొందిన ప్లానుకు భిన్నంగా నిర్మించిన భవన సముదాయాలను బీపీఎస్ కింద క్రమబద్ధీకరణకు మార్చి 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పట్నంబజారు: అరుణాచల పుణ్య క్షేత్రానికి ఏప్రిల్ 12న పౌర్ణమి పురస్కరించుకుని గిరిప్రదక్షిణ మహోత్సవానికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఏప్రిల్ 10 రాత్రి 9 గంటలకు గుంటూరులో బయల్దేరి, 11వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపులు దర్శించుకుని, అదేరోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. ఏప్రిల్ 12 ఉదయం గిరి ప్రదక్షిణ చేసుకుని స్వామివారి దర్శనం అనంతరం అదేరోజు సాయంత్రం అరుణాచలంలో ప్రయాణికులను ఎక్కించుకుని 13వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకోదలచినవారు 96164 నంబరు ద్వారా రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. టికెట్టు ధర రూ.2,420 నిర్ణయించినట్లు చెప్పారు. సమాచారం కోసం 7382894613 లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై గెట్ టు గెదర్ ఆర్గనైజేషన్ పదో ఆవిర్భావ దినోత్సవం బుధవారం నిర్వహించారు. సంస్థ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను అధ్యక్షులు డాక్టర్ మన్నె సుబ్బారావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కుమార్స్ పంప్స్ అండ్ మోటార్స్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం, ఎఫ్టానిక్స్ సిస్టమ్(పి) లిమిటెడ్ సీఈఓ దాసరి రామకృష్ణ, వేదా మోటార్స్ ఎండీ పెద్ది శివరామప్రసాద్, డాక్టర్ యడ్లపల్లి సుబ్రహ్మణ్యం, దాసరి హనుమంతరావు, నూతలపాటి తిరుపతయ్య హాజరై సంస్థ సేవలను ప్రశంసించారు. అనంతరం విద్యార్థినులు మన్నవ వాత్సల్య, గడిపూడి కీర్తిలకు ఉపకార వేతనాలను అందించారు.

అధునాతన హంగులతో యూబీఐ బ్రాంచి ప్రారంభం



యూబీఐ బ్రాంచిని ప్రారంభిస్తున్న మురళీమోహన్, రామారావు, సయ్యద్ జవహర్

కొరిటిపాడు(గుంటూరు): అధునాతన హంగులు, నూతన టెక్నాలజీతో ఆధునీకీకరించిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) జేకేసీ కాలేజీ బ్రాంచిని ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ సయ్యద్ జవహర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ ఖాతాదారుల ఉన్నతికి యూబీఐ కృషి చేస్తోందని తెలిపారు. ఖాతాదారుల ప్రయోజనాలే లక్ష్యంగా సేవలందిస్తున్నామని చెప్పారు. జేకేసీ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ మాట్లాడుతూ బ్యాంక్ బ్రాంచి దినదినాభివృద్ధి చెంది, మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజయ బ్యాంక్ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీఎస్ రామారావు, యూబీఐ డెప్యూటీ రీజినల్ హెడ్స్ అశ్వర్థ నాయక్, రాజేష్ పాల్గొన్నారు.

ఆధునికీకరించిన రీసెర్చ్ ల్యాబ్ ప్రారంభం

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల ఫార్మకాలజీ వైద్య విభాగంలో ఆధునికీకరించిన రీసెర్చ్ లేబొరేటరీని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.సుందరాచారి బుధవారం ప్రారంభించారు. ఫార్మకాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ కుర్లి శంకరరావు తన తండ్రి రిటైర్డ్ తహసీల్దారు కుర్లి వెంకటేష్ జ్ఞాపకార్థంగా సుమారు రూ.2 లక్షలతో లేబొరేటరీని ఆధునీకరించేందుకు సాయం అందించారు. ల్యాబ్‌ను ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ వైద్య కళాశాల అభివృద్ధికి ఎంతో మంది దాతలు ముందుకు వచ్చి భారీగా విరాళాలు అందిస్తున్నారని తెలిపారు. వైద్య కళాశాలలో చదువుకున్న పూర్వ వైద్య విద్యార్థులతో పాటు, కళాశాలలో పనిచేస్తున్న బోధనా సిబ్బంది కళాశాల అభివృద్ధికి తమవంతు చేయూనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రభాకరరావు, డాక్టర్ శ్రీధర్, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ కుర్లి శంకర్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

కమిషనర్ శ్రీనివాసులు



పెదపలకలూరులో డ్రెయిన్లు పరిశీలిస్తున్న కమిషనర్

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు ఎప్పటికప్పుడు చేపట్టాలని, సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. బుధవారం కమిషనర్ పెద్దపలకలూరు, అడవితక్కెళ్లపాడు, నాయీబ్రాహ్మణ కాలనీ, నల్లపాడు, రాజీవ్‌గాంధీనగర్, వల్లూరివారితోట తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇంజినీరింగ్ అధికారులు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రిజర్వాయర్లను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయడంతోపాటుగా ఏఈల వారీగా తమ పరిధిలో పైప్ లైన్ల మరమ్మతులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. పిన్ పాయింట్‌గా ఇంటింటి చెత్త సేకరణ, మధ్యాహ్నం డ్రెయిన్ల శుభ్రం జరగాలని స్పష్టం చేశారు. పర్యటనలో కార్పొరేటర్ సాంబిరెడ్డి, డీఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ సోమశేఖర్ పాల్గొన్నారు.